



జిజిహెచ్‌లో రోగి కేస్ షీట్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కలగానే 'రైల్వే' అభివృద్ధి..



పత్తా లేని కొత్త లైన్లు | కర్నూలు నుంచి రాజధానికి లేని రైలు సదుపాయం | నేడు, రేపు సిపిఎం ఆధ్వర్యంలో దీక్షలు | 3న మహాధర్నా

జిల్లాలో రైల్వే అభివృద్ధి కలగానే మిగిలిపోతోంది. ఎన్నో ఏళ్లు పలు కొత్త లైన్ల ప్రతిపాదన ఉన్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. కర్నూలు నుంచి రాష్ట్ర రాజధానికి రైలు సదుపాయం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే రైలు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో రైల్వేల అభివృద్ధి చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో శని, ఆది వారాల్లో దీక్షలు, సోమవారం ధర్నా చేపట్టనున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకు గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకు పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం కర్నూలు – శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని అలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.

డిమాండ్లు

- కర్నూలు నగరం నుండి విజయవాడ వరకు ఇంటర్ సిటీ రైలు నడపాలి.
- రద్దుచేసిన మచిలీపట్నం రైలును పునరుద్ధరించి, రెగ్యులర్ ట్రైన్‌గా మార్చాలి.
- కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకు పొడిగించాలి.
- కర్నూలు నుండి విశాఖ, కర్నూలు నుండి కాకినాడకు వారంలో రెండు రోజులు నడుస్తున్న స్పెషల్ రైళ్లను పునరుద్ధరించాలి. వాటిని రెగ్యులర్ ట్రైన్స్‌గా మార్చాలి.
- కర్నూలు నుండి ముంబాయి, సూరత్ నగరాలకు కొత్త రైళ్లు నడపాలి.
- తుంగభద్ర నుండి కర్నూలు మీదుగా శ్రీశైలం వరకు, కర్నూలు నుండి ఓర్వకల్లు మీదుగా నంద్యాల వరకు కొత్త రైల్వే లైన్లు వేయాలి.
- కర్నూలు రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణం త్వరగా పూర్తిచేసి స్థానికంగా చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి.
- ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను 6కు పెంచాలి.
- అన్ని రైళ్లలో సీనియర్ సిటిజన్లకు, వికలాంగులకు, విద్యార్థులకు, కళాకారులకు, జర్నలిస్టులకు రాయితీలను పునరుద్ధరించాలి.
- కర్నూలు జిల్లాలోని కొత్త రైళ్లు, రైల్వేలైన్ల నిర్మాణం కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వాలి.
- డోన్ వరకు జరుగుతున్న డబుల్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి.

రైల్వేను అభివృద్ధి చేయకపోతే ఉద్యమం



తక్షణమే కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ రైలును నడపాలి. శ్రీశైలం-మంత్రాలయం రైల్వే లైన్‌ను ప్రారంభించాలి. రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ప్రారంభించాలి. జిల్లాలోని కొత్త రైళ్లు, రైల్వే లైన్ల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అందుకు ఎంపి, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. లేకుంటే ప్రజలకు సమాధానం చెప్పాలి. జిల్లాలో రైల్వేను అభివృద్ధి చేయని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తాం. శని, ఆదివారాల్లో సిపిఎం చేస్తున్న దీక్షలకు, సోమవారం చేపట్టనున్న ధర్నాకు ప్రజలు మద్దతివ్వాలి. పెద్ద ఎత్తున పాల్గొని ఆ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

విజయవాడకు రైలును పునరుద్ధరించాలి



కర్నూలు నుంచి విజయవాడకు గతంలో ఉన్న రైలును పునరుద్ధరించాలి. డబుల్ లైన్ చేయడంతో పాటు కర్నూలు మీదుగా విశాఖపట్నానికి రైలు నడపాలి. చాలా సంవత్సరాలి క్రితం ప్రారంభించి రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరితగతిన పూర్తి చేయాలి. అందులో ఉద్యోగాలకు స్థానికులకే ఇవ్వాలి. కర్నూలు, ఆదోని స్టేషన్లను జంక్షన్లుగా చేయాలి. కర్నూలు నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు రైల్వే లైన్ ఏర్పాటు చేసి రైళ్లు నడపాలి.

- ఎస్‌వి మోహన్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు.

రాజధానికి రైలు లేక ఇబ్బందులు



కర్నూలు నగరానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. మొదటి భాషా ప్రయుక్త రాష్ట్ర రాజధానిగా రాయలసీమ ముఖద్వారంగా ఇది ప్రసిద్ధి. స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నది. ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ పనులు చురుకుగా సాగు తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. రాజధాని నగరానికి డైరెక్ట్ రైలు లేకపోవడం వల్ల ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడడమే కాదు అనేక అవకాశాలను కోల్పోతున్నారు.

- మన్సూర్ రెహమాన్, ఆర్థిక రంగ నిపుణులు

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- వార్డులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి
- కుష్టు వ్యాధి నిర్మూలన దిశగా ప్రజలకు మరింత అవగాహన
- హాస్పిటల్‌లో నీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని వార్డుల్లో కలెక్టర్ పర్యటించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూరో సర్జరీ, రెస్పిరేటరీ ఇన్టెన్సివ్ యూనిట్, మానసిక రోగుల వార్డు, డెర్మటాలజిస్ట్ వార్డు, ఫీమేల్, మేల్ ఆర్థో తదితర వార్డులను కలెక్టర్ పరిశీలించి రోగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ముందుగా క్యాజువాలిటీ వార్డులో చికిత్స తీసుకుంటున్న తిమ్మప్ప అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. 'ఎక్కడ నుండి వచ్చారు..? చికిత్స ఏ విధంగా ఇస్తున్నారు..?' అని ఆరా తీశారు. వివరాలు తెలుసుకుని, అతనికి బయటులో బెడ్ సిద్ధం చేయాలని కలెక్టర్ జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడే ఉన్న ఇతర రోగులతో మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారా..? చికిత్స ఏ విధంగా ఇస్తున్నారు..? సరైన సమయానికి మందులు ఇస్తున్నారా..? భోజనం ఏ విధంగా ఉంది' అని అడిగి తెలుసుకున్నారు. 39 ఏళ్ల రోగి రోహిణి కేస్ షీట్‌ను కలెక్టర్ పరిశీలిస్తూ చికిత్స ఏ విధంగా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రెస్పిరేటరీ ఇన్టెన్సివ్ యూనిట్‌ను పరిశీలిస్తూ ఇటీవల బస్సు ప్రమాదానికి గురై ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న గుణ సాయితో మాట్లాడారు. 'ఆరోగ్యం ఎలా ఉంది..? వైద్యులు అందుబాటులో ఉంటున్నారా లేదా.. అని ఆరా తీశారు. గుణ సాయి ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను పరిశీలిస్తూ గుండె సంబంధిత వైద్యం తీసుకుంటున్న దేవదాసు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ వైద్యాధికారులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. వార్డులు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో లెప్రసీ (కుష్టు వ్యాధి) నిర్మూలన దిశగా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని లెప్రసీ అధికారిని ఆదేశించారు. హాస్పిటల్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని, హైజీన్ పాటించాలని, నీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. న్యూరో సర్జరీ, యూరాలజీ ఆపరేషన్ థియేటర్లను డిసెంబర్ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపిఎంఎస్ఐడిసి ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, ఇంచార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, ఇంచార్జి సిహెచ్ఆర్ఎంఓ డాక్టర్ వెంకట రమణ, జిజిహెచ్ ఏఓ సింధు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం

నేడు, రేపు నిరసన దీక్షలు

- 3న మహాధర్నా - జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రైల్వే అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో చేపట్టే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు నగేష్ కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రైల్వే సమస్యల పరిష్కారం కోసం, రైల్వే అభివృద్ధి కోసం చేపడుతున్న నిరసన దీక్షలను, ఈ నెల 3వ తేదీ జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం, సర్వింగ్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గత వారం భోజనం కొంచెం కారంగా ఉండాలని ప్రజలు సూచించడంతో, ఆ మేరకు భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇప్పుడు రుచిలో మార్పు వచ్చిందా అని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రజలు సానుకూలంగా స్పందించి, భోజనం రుచికరంగా, నాణ్యతగా ఉందని తెలిపారు. భోజనం తక్కువ కాకుండా ప్రతి ఒక్కరికీ సరిపడే విధంగా అందించాలని కలెక్టర్ సూచించారు. రోజుకు ఎన్ని టోకెన్లు ఇస్తున్నారని కలెక్టర్ ఆరా తీశారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర ఎ.సిరి

రాయలసీమ యూనివర్సిటీలో

వేటకొడవలితో విద్యార్థి హల్‌చల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో గురువారం రాత్రి వర్సిటీకి చెందిన బీటెక్ విద్యార్థి అజయ్ నాయక్ వేటకొడవలితో హాల్‌చల్ చేశాడు. వివరాలు.. బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ నాయక్, అజయ్ నాయక్‌లు స్నేహితులు. గురువారం ఉదయం వీరి మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. అజయ్ నాయక్ ఘర్షణను మనసులో పెట్టుకుని కర్నూలు నగరంలో వేట కొడవలిని కొనుక్కుని బ్యాగులో తెచ్చుకున్నాడు. రాత్రి బాలాజీ నాయక్ హాస్టల్ గది దగ్గరకు వెళ్లి దాడి చేయడానికి యత్నించాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థులు వెంటనే గమనించి కత్తిని అతడి నుండి తీసుకున్నారు. వెంటనే వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు ఆదేశాలతో ఉన్నతాధికారులు కర్నూల్ తాలూకా పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు విద్యార్థి అజయ్ నాయక్‌ను అదుపులో తీసుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు.



ఆర్‌యూలో విద్యార్థి అజయ్ నాయక్ నుండి స్వాధీనం చేసుకున్న వేట కొడవలి

సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ హాస్టళ్లను మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా ప్రతి వారం తనిఖీ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు కేటాయించిన మండలాల్లో ప్రతి వారం పర్యటించాలని తెలిపారు. ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీ సెంటర్లు, సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రజలకు వైద్యసేవలు, సంక్షేమ హాస్టళ్లకు 15 రోజులకోసారి ఎఎన్ఎంలతో పాటు డాక్టర్‌ను కూడా పంపాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. హాస్టళ్లలో తాగునీరు, నాణ్యమైన భోజనం, విద్యా బోధన, టాయిలెట్ల నిర్మాణం ముఖ్యమైన అంశాలని, వీటిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఆదేశించారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ భారతి, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, జెడిఎ వరలక్ష్మి పాల్గొన్నారు.

స్నాతకోత్సవ ఏర్పాట్లు ముమ్మరం

- వీసీ వెంకట బసవరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



మాట్లాడుతున్న వీసీ వెంకట బసవరావు

నాలుగవ స్నాతకోత్సవ ఏర్పాట్లు ముమ్మరం చేయాలని వర్సిటీ వీసీ వెంకట బసవరావు తెలిపారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలోని సమావేశ భవనంలో స్నాతకోత్సవ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా తగిన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. రాజ్‌భవన్ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ స్నాతకోత్సవ ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె.నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎన్.నరసింహులు, సిడిసి, పరీక్షల విభాగ డీన్ ఆచార్య పివి.సుందరానంద్, రీసెర్చ్ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఆర్.భరత్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజామోదంతోనే విస్తరణ పనులు

- నగరపాలక సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజల ఆమోదయోగ్యంతోనే విస్తరణ పనులు కొనసాగిస్తామని నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు చేపట్టే రహదారి విస్తరణలో భాగంగా, ఉస్మానియా కళాశాల వద్ద కొలతలను రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ బృందం పునఃపరిశీలించింది. గురువారం మంత్రి టిజి.భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రహదారి విస్తరణకు సంబంధించి కొంతమంది బాధితులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలో తీసుకొని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశాల మేరకు, శుక్రవారం ఉస్మానియా కళాశాల వద్ద కొలతలను మరోసారి పునఃపరిశీలించామని, ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలు, సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ సూపర్‌వైజర్ మధుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు హుసేనయ్య, వేమనరావు, అక్రం, రవితేజ, సుధీర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- మంత్రి భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. శుక్రవారం నగరంలోని 15వ వార్డు పరిధిలోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ పార్కులో టిడిపి 15వ వార్డు ఇన్‌ఛార్జ్ పామన్న ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి భరత్ ముఖ్యఅతిథిగా హాజరయి పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడారు. ప్రతేడాది దసరా సందర్భంగా పామన్న కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ దసరా నాడు తాను విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఇప్పుడు వస్త్రాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 15వ వార్డు కార్పొరేటర్ శివమ్మ, టిడిపి నాయకులు అబ్బాస్, జేమ్స్, రవికుమార్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి భరత్

ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి సహకరించాలి

- అధునాతన ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్స్‌ను ప్రారంభించిన ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రహదారి భద్రత నిబంధనలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అధునాతన ట్రాఫిక్ నియంత్రణ బారికేడ్ పరికరాలను కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... కర్నూలు ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలకు, విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంపింగ్ వంటివి చేయకుండా ఎలా ఉండాలనే విషయంపై అవగాహన కల్పిస్తామన్నారు. అంతకుముందు ట్రాఫిక్ పోలీసులు, షో రూమ్‌ల యువకులు కలిసి హెల్మెట్‌పై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సిఐలు మన్సురుద్దీన్, కిమ్స్ హాస్పిటల్ సిఇఒ డాక్టర్ సునీల్ కుమార్, జెమ్ కేర్, కామినేని హాస్పిటల్ సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్, బాలాజీ ఆయిల్స్ అధినేత షరఫ్ సత్యదేవ, వస్త్రాలయ షాపింగ్ మాల్ అధినేత వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.



నమూనాను ప్రారంభిస్తున్న ఎస్పీ

ఘనంగా హాలో వీన్స్ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రామచంద్ర మిషన్ సమీపంలోని హారిజోన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో హాలో వీన్స్ వేడుకలు ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్, డైరెక్టర్ కె.పావని ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు దయ్యాలు, రాక్షసులు వంటి విభిన్న దుస్తులు ధరించడం, గుమ్మడికాయల అలంకరించడం, చిట్టి పొట్టి సంబంధిత డైలాగులు ఉచ్చరించటం, హావాభావాలను ప్రదర్శించటం వంటివి చేసి అలరించారు. తల్లిదండ్రులు పిల్లల వేషధారణలతో కూడిన హావాభావాలు చూసి మురిసిపోయారు. పిల్లల్లో సాంస్కృతిక అవగాహన పెంపొందించడం, సృజనాత్మకతను పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పాటునిస్తాయని నిర్వాహకులు కె.పావని తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని రాయలసీమ వర్సిటీ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సాయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకొని వెంటనే జీతాలు కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ట్రాఫిక్ రూల్స్, డ్రంకెన్ డ్రైవ్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కర్నూలు జిల్లా కోర్టులో గల న్యాయ సేవా సదన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు సాగింది. జిల్లా జడ్జి కబర్థి మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని కోరారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, మొదటి అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, 7వ అదనపు జిల్లా జడ్జి వి.లక్ష్మీరాజ్యం, సిబిఐ కోర్టు జడ్జి ఎం.శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సరోజినమ్మ, అనూష, కర్నూలు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ భరత్ చవాన్, కర్నూలు ఆర్‌టిసి డిపో మేనేజర్ సుధారాణి, కర్నూల్ టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్, కర్నూలు టౌన్ ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, దిశా సిఐ రామానాయుడు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం పాల్గొన్నారు. **పత్తికొండలో** రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై న్యాయవాదులతో కలిసి పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోత్స్న దేవి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాలింత మృతి కథనంపై స్పందన

- వివరణ కోరిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

ప్రజాశక్తి - సిబెళగల్

సిబెళగల్‌లోని 24 గంటల వైద్య సేవల ఆస్పత్రిలో ప్రసవం అయ్యాక కర్నూలు ఆస్పత్రిలో 'బాలింత మృతి'కి కారకులెవరు అన్న శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సిబెళగల్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్‌ను, స్టాఫ్ నర్సును వివరణ కోరారు. ఈ విషయంలో బాలింత అనూష బెళగల్ ఆస్పత్రిలో ప్రసవమయ్యారని, తీవ్ర రక్తస్రావంతో, ఆయాసంతో వర్షం వస్తున్న వేళ అంబులెన్సు, అందుబాటులో లేదని స్టాఫ్ నర్సు కూడా తగిన మెళకువలు పాటించినట్లు లేదని వివరణలో పేర్కొన్నారు. అలాగే వైద్యులు నిరసనలో ఉన్నామని, ఆస్పత్రిలో అందుబాటులో లేనందున ఈ సంఘటన జరగడం అమానుషమని వివరణలో పేర్కొన్నారు. ప్రజాసంఘాల నాయకులతో వచ్చి ధనరూపంలో సాయం అడిగింది లేదని వాస్తవాలు కప్పిపుచ్చుడానికే వారు వారి అనుకూల వ్యక్తినే తమ దగ్గరికి పంపి పక్కదారి పట్టించారని కుటుంబీకులు దయనీయ స్థితిలో విలపిస్తున్నారు. 108 ప్రస్తావన కన్నా బాలింతకు ఏమీ కాదని ఉదయం వరకు చెప్పుకొచ్చారని, ఆస్పత్రి పక్కనే వెళ్లేందుకు ట్యాక్సీలు ఎప్పుడూ ఉంటాయని, అమాయకులంటే చెలగాటమాడతారని బాధితులు వాపోయారు.

కెఎంసి కీర్తి ప్రతిష్టలు పెంచాలి

- రిటైర్డ్ అడిషనల్ డిఎంఇ, కెఎంసి రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

యువ వైద్య విద్యార్థులు కర్నూలు మెడికల్ కళాశాల కీర్తి ప్రతిష్టలు పెంచాలని రిటైర్డ్ అడిషనల్ డిఎంఇ, రిటైర్డు ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. నూతనంగా వైద్య విద్యలో ప్రవేశించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు 2023 బ్యాచ్ ఎంబిబిఎస్ విద్యార్థులు 'విహాన్ 2025' పేరుతో శుక్రవారం 'ఫ్రెషర్స్ డే' నిర్వహించారు. సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. వైద్య విద్య గొప్ప వరమని, పేద రోగులు బోధకులుగా మారి వైద్య విద్యను అందిస్తారని, వారిపట్ల ఓపికతో వ్యవహరించి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. అప్పుడే కచ్చితమైన వైద్యాన్ని అందించగలమని తెలిపారు. వైద్య విద్యార్థులకు క్లినికల్స్ వెన్నెముక లాంటివని, వాటికి ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. విద్యార్థులు, ప్రొఫెసర్స్ సొంత కుటుంబంలాగా ఉండాలని తెలిపారు. కెఎంసి విద్యార్థులు వైద్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు సంపాదించారని చెప్పారు. ఎడిఎంఇ, కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ... కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు సాధించడం అంటేనే ప్రతిభ గల విద్యార్థులకే అది సాధ్యమని తెలిపారు. సీనియర్, జూనియర్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, రీజినల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయ్ ఆనంద్ బాబు, డాక్టర్ సింధియా శుభప్రద పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డిఎంఇ సుధాకర్

ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధి..

- జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ
- ఎంపీ నాగరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) నిలుస్తుం దని ఎంపీ బస్తిపాటి నాగరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. శుక్రవారం నగరం లోని జిల్లా పశువుల అభివృద్ధి సంఘం సమావేశ భవనంలో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో ఆపరేటివ్ వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ నాగరాజు మాట్లాడారు. కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని, ఈ సొసైటీలో చిన్న సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం.. రైతుల ప్రభుత్వమని తెలిపారు. జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, కర్నూలు జిల్లా సహకార ఆడిట్ అధికారి చెన్నమ్మ, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణ, డిఎల్‌సిఒ నాగ రమణయ్య, జయకర్, పుల్లయ్య, బిజినెస్ మేనేజర్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

సాగు, తాగునీటి కోసం పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-ఆదోని

మండలంలో సాగు, తాగునీరు, స్థానిక సమస్యలపై సిపిఎం అధ్వర్యంలో జీపుయాత్రలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో మండల కార్యదర్శి కె.లింగన్న అధ్యక్షతన మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఎల్‌ఎల్‌సి ద్వారా కేవలం 4 గ్రామాలకు మాత్రమే సాగునీరు అందుతోందని తెలిపారు. మిగతా 40 గ్రామాలు వర్షంపై ఆధారపడిన మెట్ట పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఈఏడాది కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని, పంట దిగుబడి రాక ధరల్లేక పట్టుబడి కూడా రావడం లేదని తెలిపారు. అప్పులు తీర్చడానికి కూలీలతో పాటు రైతులు కూడా ఇతరత ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, తక్షణమే కూటమి ప్రభుత్వం తుంగభద్ర నదిపై మేళిగనూరు దగ్గర వరద కాలువ నిర్మించాలని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా నెమలికల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి బసరకోడు వరకు అదనపు పైపులైన్, కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంకు నుంచి పాండవగల్ వరకు అదనపు పైపులైన్, చిన్నహరివాణం దగ్గర నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నుంచి సంతేకుడ్లూరు, పెద్దహరివాణం వరకు అదనపు పైపులైన్ వేయాలని కోరారు. రోడ్లు, శ్మశాన వాటికలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెలలో జీపు యాత్రలు, పాదయాత్రలు నిర్వహించి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు ఎం.ఉచ్చీరప్ప, జి.రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు బాష, అయ్యప్ప, హనుమంతు రెడ్డి, పాండురంగ, అయ్యన్న, శాఖా కార్యదర్శులు గోవిందు, అనీఫ్ బాషా, రామాంజనేయులు, దస్తగిరి బాషా, పరమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఆరోగ్యం పదిలం

- మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



క్రీడలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

క్రీడలతో విద్యార్థుల్లో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మంచాల సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని విద్యానగర్‌లో నిర్వహిస్తున్న క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. క్రీడల వల్ల మానసికోల్లాసం పెంపొందుతుందని, దేహ దారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. క్రీడల ప్రోత్సాహకానికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. అండర్-14, 17 బాలికల కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, వాలీబాల్ పోటీలు విజయవంతంగా పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కోసిగి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, పెద్దకడబూర్ మండల మాజీ అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, నాయకులు సతీష్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జ్ఞానేష్, చిన్నతుంబలం సొసైటీ చైర్మన్ నరసప్ప, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాలపల్లి లక్ష్మన్న, నరసింహులు, వేమిరెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

- కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి - ఆస్పరి



రైతులకు సస్యరక్షణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సస్యరక్షణ పద్ధతులు పాటించడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని బిల్లేకల్లు సచివాలయం ముందు ఆలూరు హార్టికల్చర్ అధికారి ఇందిరా ఆధ్వర్యంలో రైతులకు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టమోటా సాగు చేసిన అనంతరం వర్షాలు కురిసినప్పుడు బ్యాక్టీరియా, మచ్చ తెగులు నివారణకు సిఒసి ప్లస్ ప్లంటమైసిక్ పిచికారి చేయాలన్నారు. సూది పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు, ఎకరాకు 6 వాటర్ ట్రాప్స్ పెట్టడం వల్ల ఆకు ముడత తెగులును కూడా 30 నుంచి 70 రోజుల్లో నివారించుకోవచ్చని చెప్పారు. వేర్లు కుళ్లు రాకుండా ట్రిచోడేర్మో 1కిలో సూడోమోగోస్ 1 కిలో ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు.

అభివృద్ధి తెచ్చిన నీటి కష్టాలు..!

- పైపులైన్ తొలగింపు - గ్రామస్తులకు అందని నీరు
- నెలలుగా సమస్యను పరిష్కరించని అధికారులు

ప్రజాశక్తి - నందవరం



బాత్‌రూమ్‌లపై పడేసిన పైపులు

అభివృద్ధి పనులతో జనజీవనం సాఫీగా, ఆనందంగా సాగుతుంది. కానీ నందవరం గ్రామస్తులకు మాత్రం కష్టాలను తెచ్చి పెట్టాయి. నందవరం గ్రామం 6వ వార్డులోని ఒక వీధిలో కొన్ని నెలల క్రితం కూటమి ప్రభుత్వం సిసి రోడ్డును నిర్మించింది. వీధిలో సంవత్సరాలుగా ఉన్న డ్రెయినేజీ, రోడ్డు సమస్యలు తీరాయి. ఆ అభివృద్ధి వీధి ప్రజలకు కొత్తగా నీటి కష్టాలను తెచ్చిపెట్టింది. సంవత్సరాలుగా వీధిలో నీరు సమృద్ధిగా ఉండేవి. రోడ్డు నిర్మాణం వల్ల నీటి సమస్య తలెత్తిందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు నిర్మించే సమయంలో అధికారులు పైపులైన్ మొత్తం తొలగించారు. వారంలోపు పైపులైన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నెలలు గడిచినా అధికారులు తమ కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. తొలగించిన పైపులను బాత్‌రూమ్‌లపై పడేశారు. అవి వర్షానికి తడసి తుప్పు పట్టాయి. పైపులు బాత్‌రూమ్‌లపై ఉండడం వల్ల తమకు అసౌకర్యంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు పనులు వదులుకొని సైకిళ్లు, స్కూటర్లపైన నీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడింది.

నీటి సమస్యను పరిష్కరించాలి

- మాచాని ఎల్లమ్మ



గతంలో పంచాయతీకి చలానా కట్టి కుళాయి కనెక్షన్ తీసుకున్నాం. అప్పటి నుంచి నీటి సమస్య ఉండేది కాదు. ప్రస్తుతం తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పైపులను నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

మూడు నెలలుగా ఎటిఎం మూత

- పట్టించుకోని బ్యాంకు అధికారులు - మండల ప్రజల ఆగ్రహం - అవస్థలు పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో కెనరా బ్యాంకు ఎటిఎం మూతపడి మూడు నెలలు కావస్తున్న సంబంధిత బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదు. ఎటిఎం పని చేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరికి వివిధ గ్రామాల నుంచి వివిధ పనులపై, వ్యాపారాలపై ప్రజలు వస్తుంటారు. డబ్బులు అవసరమై ఎటిఎం వద్దకు వచ్చి డబ్బులు డ్రా చేసేందుకు చూడగా, ఎటిఎం మూతపడడంతో ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇదెక్కడి ఎటిఎం రా... బాబు. ఎప్పుడు చూసినా మూతపడి ఉంటాది' అనే వారే ఎక్కువ. చిప్పగిరి సిండికేట్ బ్యాంకు (కెనరా బ్యాంకు) ముందు ఎటిఎం ఏర్పాటు చేయగా నెలల తరబడి మూత పడి ఉండడం ఏమిటని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కెనరా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకొని ఎటిఎం తెరచుకునే విధంగా చూడాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 12 పంచాయతీలు, 16 గ్రామాలు ఉండగా, చిప్పగిరి మండల కేంద్రం కావడంతో వైద్య, ఆరోగ్య పనులపైన, విద్యార్థులు, పొదుపు మహిళలు, వివిధ రకాల పనులపైన, వ్యాపారులు, రైతులు పెట్టుబడులకు తదితర పనులపైన వస్తుంటారు. డబ్బులు అవసరమై ఎటిఎం దగ్గకు వెళితే ఎప్పుడూ మూతపడి ఉండడంతో ఇబ్బందులు చెందుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను, రైతులను, విద్యార్థులను, వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని చిప్పగిరి కెనరా బ్యాంకు ముందు ఏర్పాటు చేసిన ఎటిఎం తెరచుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు చూసినా మూతే

- సురేష్, బంటనహాల్ గ్రామం



అవసరం పడి తొందరగా చిప్పగిరికి వెళ్లి ఎటిఎంలో డబ్బులు డ్రా చేసుకుందామని వస్తే ఎప్పుడూ నిరాశ ఎదురవుతోంది. అవసరానికి ఎటిఎం కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. చిప్పగిరిలో నెల రోజులుగా ఎటిఎం కేంద్రం మూతపడి ఉంది. గుంతకల్లు పట్టణానికి పనులు వదిలేసి పోవాల్సి వస్తోంది. వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని కెనరా బ్యాంకు అధికారులు ఎటిఎం త్వరగా పనిచేసేలా చూడాలి.



కూల్చేసిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠశాల భవనాలు కూల్చివేస్తే చర్యలు : ఎంఇఒ

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న పాత పాఠశాల భవనాలను ఎవరైనా కూల్చి వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఇఒ తిమ్మారెడ్డి హెచ్చరించారు. గత రెండు రోజుల క్రితం మండలంలోని ఐరన్ బండ బి సెంటర్ గ్రామంలో ప్రభుత్వ పాత పాఠశాల భవనాన్ని బీసీ సామాజిక వర్గం దేవాలయంలోకి ఆక్రమించుకోవాలని కూల్చివేయడంతో మరో సామాజిక వర్గం మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎంఇఒ తిమ్మారెడ్డి గ్రామానికి వెళ్లి కూల్చేసిన పాఠశాల భవనాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ... జిల్లా విద్యాశాఖ అధికారుల అనుమతులు లేకుండా పాఠశాల భవనాలను కూల్చివేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మంత్రాలయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గృహ నిర్మాణానికి దరఖాస్తులు చేసుకొన్న లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టాలని ఎంపిడిఒ నూర్జహాన్ కోరారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా కానీ, ఎన్‌టిఆర్ గృహ సంకల్పం పథకం ద్వారా గృహ నిర్మాణాలు చేపట్టవచ్చని తెలిపారు. పొదుపు మహిళలకు అదనంగా ప్రభుత్వ రుణం చెల్లిస్తుందని చెప్పారు. నిర్మాణాలు చేపట్టకపోతే ప్రభుత్వం నుంచి మంజూరైన ఇంటి పట్టాలను రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎపిఎం రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కవిత, వెలుగు సిసి ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకున్న సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించిన సిఐ రామాంజులు ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. శుక్రవారం కర్నూలులోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. అనంతరం సిఐకి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రధాని మోడీ కర్నూలు పర్యటనలో విధులు సక్రమంగా నిర్వర్తించినందుకు ఈ అవార్డు అందుకున్నారు.




ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ

ఇందిరాగాంధీ సేవలు ప్రశంసనీయం


- కౌన్సిలర్ చలపతి

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు ప్రశంసనీయమని కౌన్సిలర్ చలపతి కొనియాడారు. శుక్రవారం ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కొత్తబస్టాండ్ ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. మధుబాబు, విశ్వనాథ్, ఇందిరానగర్ కాలనీవాసులు లక్ష్మణరావు, నరసింహులు, మంతు మల్లి, దేవేంద్ర, అర్జున్, నాగేంద్ర, రామాంజి, నరసింహులు ఉన్నారు.



విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాలనీవాసులు



భార్య కోసం సెల్ టవర్ ఎక్కిన యువకుడు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య కాపురానికి రావడం లేదనే బాధతో ఒక యువకుడు సెల్ టవర్ ఎక్కి చస్తానని హల్‌చల్ సృష్టించాడు. శుక్రవారం రాత్రి స్థానిక రామచంద్ర నగర్ కాలనీకి చెందిన దుబ్బన్న కుమారుడు మోహన్, అదే కాలనీకి చెందిన దానియేల్ కుమార్తె స్నేహ ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యతో గొడవ పడి ఆత్మహత్య చేసుకుంటానని యువకుడు టవర్ ఎక్కి హెచ్చరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య చేసుకోవద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తన భార్యతో మాట్లాడిస్తే కిందికి దిగుతున్నానని చెప్పడంతో కుటుంబ సభ్యులు భార్యను సంఘటన స్థలానికి తీసుకొచ్చి, భార్యతో మాట్లాడించగా.. టవర్ నుంచి కిందికి దిగాడు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గతంలో కూడా మోహన్ సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు.

డ్రగ్స్ జోలికెళ్లొద్దు

- ఎస్ఐ రామస్వామి

ప్రజాశక్తి - ఆదోని

డ్రగ్స్ జోలికి వెళ్లి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆదోని త్రీ టౌన్ ఎస్ఐ రామస్వామి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని నోబెల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ సంగటి దేవదానం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అంతకుముందు 'డ్రగ్స్ వద్దు బ్రో' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల ఏకాగ్రత, విచక్షణ కోల్పోతారని, నరాల బలహీనత ఏర్పడి శరీర ఎదుగుదల ఉండదని తెలిపారు. విద్యార్థి దశలో బాగా చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల ప్రభావానికి లోనుకాకుండా యోగా, వ్యాయామం చేసి శరీరాన్ని దృఢంగా ఉంచుకోవాలన్నారు. 'డ్రగ్స్ వద్దు భవిష్యత్తు ముద్దు' అంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ అబ్దుల్ బాషా, డాక్టర్ సలోమి, డాక్టర్ ఖాలిక్, డాక్టర్ ఇస్మాయిల్, స్రవంతి, సోనీ, సౌజన్య, విరుపాక్షి, దినకర్, సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, నాగరాజు, ఉమెన్ కానిస్టేబుల్ రాజేశ్వరి, విద్యార్థులు ఉన్నారు.




అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామస్వామి

అనారోగ్యంతో గ్రామ సేవకుడు మృతి

- తహశీల్దార్ సంతాపం, ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరికి చెందిన గ్రామ సేవకుడు భీమన్న (విఆర్ఎ) (69) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం చిప్పగిరి తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, స్థానిక విఆర్ఒ గోవిందన్న తహశీల్దార్ కార్యాలయ సిబ్బందితో కలిసి భీమన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ... తలారి భీమన్న అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. అలాగే కుటుంబానికి ప్రభుత్వం తరపున ఏ సహాయం అవసరమున్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. జూనియర్ అసిస్టెంట్ వీరేష్, విఆర్ఒలు మల్లికార్జున, చంద్ర నాయక్, వాచ్‌మేన్ బ్రహ్మయ్య, విఆర్ఎలు హనుమంతు, రవి పాల్గొన్నారు.



భీమన్న కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న తహశీల్దార్

జాతీయ సమగ్రతను చాటుదాం

- ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి ఒక్కరూ జాతీయ సమగ్రతను చాటాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవం సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీని చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రధాన రహదారుల గుండా ఎమ్మిగనూరు సర్కిల్ వరకు 130 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కరస్పాండెంట్ దైవాధీనం రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి, అధ్యాపకులు రామకృష్ణ, ఎర్రిస్వామి, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ గోవిందు, ఎన్‌సిసి డివిజన్ అధికారి జొనాథన్ వీక్లీఫ్, ఉమాదేవి, వెంకటరామిరెడ్డి, సంతోషి, నేత్రావతి పాల్గొన్నారు. **మంత్రాలయం** పోలీసు స్టేషన్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ శివాంజల్ ఆయన మాట్లాడారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం పటేల్ విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం మాధవరం రహదారిలో ఉన్న హెచ్‌పి పెట్రోలు బంకు వరకు రన్నింగ్‌తో ర్యాలీ నిర్వహించారు. హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మి నారాయణ, వెంకటేశ్వర్లు, ఆంజినేయులు, భాస్కర్, పోలీసులు పరమేష్, రామకృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు. **చిప్పగిరిలో** జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేషనల్ యూనిటీ డే సందర్భంగా పోలీసు స్టేషన్ వద్ద రన్ ఫర్ యూనిటీ చేపట్టారు. అనంతరం ప్రజలతో సమైక్యంగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో మొక్కలు నాటారు. ట్రెయినీ ఎస్ఐ రాజా కుళ్లాయప్ప, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, ఖాదర్ బాషా, పోలీసులు మురళీ, హోంగార్డ్ శంకర్ పాల్గొన్నారు.



ఆదోనిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్ఐ



చిప్పగిరిలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ

అసెంబ్లీలో పాల్గొనేందుకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - ఆదోని

అసెంబ్లీ సెషన్ వీక్షించేందుకు ఆదోని విద్యార్థిని వంశిత ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్ తెలిపారు. శుక్రవారం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వంశితను వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించగా, ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసినట్లు చెప్పారు. అందులో వంశిత అసెంబ్లీలో జరిగే వేడుకలకు హాజరయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు రాజా, సతీష్, రమేష్ నాయుడు, నాగేశ్వర్ నాయుడు, జగన్మోహన్ రావు ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హోమానికి ఎమ్మెల్యే దంపతులు హాజరు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విశ్వశాంతి మహాయాగ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలోని యజ్ఞశాలలో నిర్వహిస్తున్న అతిరుద్ర హోమంలో ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారు. శుక్రవారం గణపతి పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. హోమ నిర్వాహకుడు స్వరూపానంద స్వామి ఎమ్మెల్యే బీవీ దంపతులను ఆశీర్వదించారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులకు స్థానిక నాయకులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ దంపతులు



స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి నూరుల్ ఖమర్

లేఅవుట్, టెక్స్‌టైల్ పార్కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని బనవాసి గ్రామ సర్వేలో ఉన్న ఎంఐజి లేఅవుట్, టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని జెసి నూరుల్ ఖమర్ పరిశీలించారు. శుక్రవారం ఆయన స్థలాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆదోని ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ తహశీల్దార్ ఎ.శేషఫణి పాల్గొన్నారు.

'నేడు బంద్‌ను జయప్రదం చేయండి'

రైట్‌అప్: మాట్లాడుతున్న సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని జిల్లాతో పాటు, పెద్దహరివాణం గ్రామాన్ని మండలం చేయాలని శనివారం చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని గ్రామ సాధన కమిటీ సభ్యులు ఆదినారాయణ రెడ్డి, రాఘవేంద్ర ఆచారి, మెడికల్ నాగరాజ్, రేణుకచారి, కరెప్ప, సున్ను సాబ్, తిమ్మప్ప కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక కొత్త జిల్లాలతోపాటు డివిజన్ కేంద్రాలు, నూతన మండలాలు ఏర్పాటు చేస్తుందన్న ప్రకటనతో వివిధ దశలుగా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అత్యంత విశాలమైన పెద్దహరివాణం గ్రామాన్ని, మండలంలోని అతిపెద్ద గ్రామాన్ని మండలం కేంద్రం చేయాలని కోరారు. ఈ బంద్‌లో విద్యార్థులు, యువకులు, మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్‌టియు కృషి చేస్తోందని ఎస్‌టియు జిల్లా కౌన్సిలర్ నాగేంద్రప్ప తెలిపారు. శుక్రవారం ఆస్పరిలోని ఎంపిపి పాఠశాలలో ఎస్‌టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్తగా ఎంపికయిన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో మెలిగి విద్యార్థులకు మంచిగా బోధనలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎస్‌టియు మండల అధ్యక్షులు పి.ఉరుకుందు, కార్యదర్శిగా యు.రామాంజిని, ఆర్థిక కార్యదర్శిగా ఎమ్‌డి.కేశవులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకులు నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతి మూర్తి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఎస్‌టియు మండల కమిటీ

పట్టణ సమగ్రాభివృద్ధికి సిపిఎం సూచన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణాభివృద్ధికి సిపిఎం ఈ కింది సూచనలు చేస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పత్తి, వేరుశనగ పంటలకు ప్రసిద్ధిగాంచిన ఆదోనిలో ఒక్కప్పుడు మూడు స్పిన్నింగ్ మిల్లులు, 5, 6 పెద్ద ఆయిల్ ఫ్యాక్టరీలు, వందల సంఖ్యలో జిన్నింగ్, ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలు ఉండేవని తెలిపారు. వేలాది మందికి ఉపాధి దొరికేదని, నేటి పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిందని విమర్శించారు. ప్రభుత్వాల విధానాలు, ప్రజాప్రతినిధుల వల్ల పరిశ్రమలు మూతపడడంతో వేలాది మంది ఉపాధి కోల్పోయారన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పాలకులు కనీసం ప్రయత్నం కూడా చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినప్పటికీ ఆదోని పట్టణ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. పట్టణ సమగ్రాభివృద్ధికి మెడికల్ కళాశాల నిర్మాణం,ని ర్వహణ ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వాస్పత్రిలో, స్త్రీల, చిన్నపిల్లల ఆస్పత్రులను జిల్లాస్థాయి హాస్పిటల్‌గా అప్ గ్రెడ్ చేస్తూ అన్ని రకాల జబ్బులకు వైద్యులను నియమించి, మెరుగైన వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాస్పత్రిలో సిటి స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించి వ్యాపారులకు కేటాయించాలని కోరారు. పట్టణం నడిబొడ్డున కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలని కోరారు. పట్టణంలో పార్కులు ఏర్పాటు చేయాలని, పార్కుల్లో కనీస సౌకర్యాలు కల్పించి, చిన్నపిల్లల ఆటలు, పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాల పనులు పూర్తి చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వాలని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ ఉన్న ఆదోనిలో కాటన్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే పార్థసారధి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జాతీయ సమైక్యతకు పాటుపడిన పటేల్ - ఎంపీ నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జాతీయ సమైక్యతకు పాటుపడిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీ, జెసి నూరుల్ ఖమర్, సెట్కూర్ సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పటేల్ భావాలు, ఆదర్శాలను పాటించి జాతీయ సమైక్యతను పటిష్టపర్చడమే పటేల్‌కిచ్చే నిజమైన నివాళి అని ఎంపీ పేర్కొన్నారు. డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, మై భారత్ సెంటర్ జిల్లా యువజన అధికారి రాహుల్ రెడ్డి, సిపిఒ భారతి పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)**లోని మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, కల్లూరు మండల నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నన్నూరు సొసైటీ ఛైర్మన్ ఉయ్యాలవాడ నాగేశ్వర రెడ్డి, సల్కాపురం దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఏ క్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ యూనిటీ డే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని, దేశ సమగ్రత, సుస్థిరతను కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్ పాల్గొన్నారు. అలాగే డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి కళాశాల ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. **కర్నూలు (క్రైమ్)**లో కర్నూలు పోలీసులు యూనిటీ రన్ నిర్వహించారు. సివిల్, ఎఆర్, ఎపిఎస్‌పి, హోంగార్డులు, క్రీడాకారులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఐక్యతా పరుగు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై రాజ్ విహార్ కూడలి వరకు సాగింది. ఈ రన్‌లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులకు కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా బహుమతులను అందజేశారు. ఎఆర్ అడిషనల్ ఎస్పీ కష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు. **కర్నూలు (కార్పొరేషన్)** నగరపాలక కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆర్ఒ జునైద్, సూపరింటెండెంట్లు రామకృష్ణ, క్రిస్టోఫర్, సిబ్బంది శ్రీదేవి, కృష్ణమోహన్, సరస్వతి, శోభారాణి, భార్గవ్, షబానా పాల్గొన్నారు. **కర్నూలు (కలెక్టరేట్)**లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి ఆధ్వర్యంలో పటేల్ జయంతి నిర్వహించారు. ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ నాగరాజు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి


నివాళులర్పిస్తున్న మేనేజర్ చిన్నరాముడు


నివాళులర్పిస్తున్న మైపర్ సిబ్బంది


సన్మానిస్తున్న ఎస్పీ

విరమణ ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సుధీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు కోర్టు మానిటరింగ్ సిస్టమ్‌లో పని చేస్తున్న ఎస్ఐ ఎ.మహబూబ్ బాషా శుక్రవారం విరమణ పొందారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మహబూబ్ బాషాకు శాలువ, పూలమాల వేసి, జ్ఞాపికను అందజేసి ఎస్పీ సన్మానించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, మహబూబ్ బాషా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టిజివి కళాక్షేత్రంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు ఉత్సవ్-2025లో భాగంగా టిజివి కళాక్షేత్రం శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించింది. 'ఉమ్మడి కర్నూలు జిల్లా వైభవం' అంశంపై కళాక్షేత్రం మెయిన్ హాలులో పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో 79 మందికి గాను 63 మంది పాల్గొన్నట్లు కన్వీనర్లు పిపి.గురుమూర్తి, చంద్రకంటి మద్దయ్య, మహ్మద్ మియా తెలిపారు.

నేటి నుంచి కర్నూల్ ఉత్సవ్-2025

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా కర్నూలు టిజివి కళాక్షేత్రంలో శనివారం నుంచి ఏడు రోజులపాటు సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి ఓబులయ్య, యాగంటీశ్వరప్ప తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. శనివారం ఉదయం 9 గంటలకు తెలుగు తల్లి, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పుష్పాలంకరణ, అనంతరం కలెక్టరేట్ నుంచి టిజివి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తర్వాత రవీంద్ర విద్యాసంస్థల వారిచే నృత్య ప్రదర్శన, సాయంత్రం 6 గంటలకు జి.నారాయణ స్వామి శిష్యులచే శాస్త్రీయ నృత్యాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత్రి 8.30 గంటలకు నంది అవార్డు గ్రహీత మహ్మద్ మియా పర్యవేక్షణలో జానపద నృత్యాలు, వెంకటరమణ బృందం వారిచే కోలాటం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ డబ్ల్యు.సీతారాం, తెలంగాణ రిటైర్డ్ డిజిపి కొత్తకోట శ్రీనివాసరెడ్డి, కర్నూలు డిఇఒ శ్యామ్యూల్ పాల్, బనగానపల్లెకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త బీసీ.రాజారెడ్డి, నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ప్రతిభ విద్యాసంస్థల అధినేత అరుణాచల్ రెడ్డి, గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర, ప్రముఖ అవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ, రంగస్థలం రజనీ బాయిలకు సత్కారం ఉంటుందని వివరించారు.

జగన్‌కు బాబును విమర్శించే అర్హత లేదు

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



ప్రకృతి వైపరీత్యాల సమయంలో గడప దాటని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, తుపానుకు ముందే అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించడం విడ్డూరంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణనష్టం జరగకుండా, పునరావాస కేంద్రాలకు ప్రజలను చేర్చి, వారు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా కాపాడగలిగారని తెలిపారు. ఈ విషయంలో చంద్రబాబు కృషిని ప్రపంచమే అభినందిస్తుందన్నారు. నిత్యం శవ రాజకీయాలకు పాల్పడే వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఏ అంశం దొరకకపోవడంతో అక్కసుతో చౌకబారు విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- కొవ్వొత్తుల ర్యాలీకి హాజరైన అడిషనల్ ఎస్పీలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసు అమరవీరుల త్యాగాలు మరవలేనివని అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి కర్నూలు నగరంలో పోలీసు అమరవీరులను స్మరిస్తూ కర్నూలు పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పోలీసు కార్యాలయంలోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులను ఉంచి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి పెద్ద మార్కెట్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు పోలీసు బ్యాండ్ మధ్య పోలీసు అధికారులు సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఎపిఎస్‌పి 2వ బెటాలియన్ డీఎస్పీలు ఎస్ఎమ్.బాషా, రవికిరణ్, వెంకట శివుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని, బి క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా కె.మోహన్ మీనన్, డైరెక్టర్ (కార్పొరేట్ రిలేషన్స్), డీఎస్పీ ఎస్.మహబూబ్ బాష పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీయాలన్నారు. సమాజానికి ఉపయుక్తమైన వ్యక్తిగా ఎదగాలంటే నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అత్యవసరమని తెలిపారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు విజయశేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్, జాబీనా అక్తర్, సోమేష్, సుజాత, గిరిజ, ఉల్గోజి రావు, పార్థసారథి పటేల్, శ్రావణి, బాలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కోడుమూరు

గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎసి.రాముడు కోరారు. శుక్రవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కట్టకుండా నిలిపేసిన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను ఆపాలి

- యుఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలని యుఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారులు మాడిశెట్టి అరుణ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షులు తాడికొండ రవి, రాష్ట్ర కార్యదర్శి సందెపోగు ఉదయ్ కుమార్ కోరారు. శుక్రవారం కర్నూలులోని స్థానిక జిల్లా పరిషత్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 10 మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేట్ సంస్థలకు కట్టబెడుతోందని తెలిపారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్యన్, సందీప్, ప్రేమ్ కుమార్, జాన్ బాబు, పవన్, హరి రెడ్డి పాల్గొన్నారు

కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి నిర్వహించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ ఎన్‌సి.బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా ఛైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఓబీసీ సెల్ జిల్లా ఛైర్మన్ డివి.సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఛైర్మన్ ఎ.సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగర హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. హోటల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు జి.పురుషోత్తం అధ్యక్షత వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి టి.రామాంజనేయులు, సిపిఐ నగర కార్యదర్శి కె.రామకృష్ణారెడ్డి, ఎఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.చంద్రశేఖర్, బి.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, హోటల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు నాగేంద్ర, ట్రెజరర్ రంగనాయకులు, అయ్యన్న, శ్రీకాంత్, గంగావతి, ముర్తుజావలీ, పాండు, రాము, బి.సురేష్, బి.వంశీ పాల్గొన్నారు.

ఆర్‌యు రిజిస్ట్రార్‌ను తొలగించాలి

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ బిఒడీ కళాశాలలకు వత్తాసు పలుకుతున్న రిజిస్ట్రార్‌ను తొలగించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయల సీమ వర్సిటీలో ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, ఆర్‌పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీలో అవినీతికి అధికారులే తెరలేపుతున్నారని విమర్శించారు. బిఇఒ కళాశాలలపై ఆందోళనలు నిర్వహించినా, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఏమాత్రం చలనం లేదన్నారు. సెక్యూరిటీ కాంట్రాక్టు ఏజెన్సీ మొదలుకొని, యూనివర్సిటీ వసతి గృహాల్లో అనుకూలమైన వారిని నియమించుకొని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను నుంచి తొలగించి, స్థానికులనే రిజిస్ట్రార్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ, ఆర్‌పిఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు ఆలీ, కిరణ్, మహేష్, మహ్మద్, భార్గవ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి - పత్తికొండ

పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని వ్యకాస నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు బుజులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, వ్యకాస మండల కార్యదర్శి నరసన్న, సిఐటియు మండల అధ్యక్షులు గోపాల్, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్ధయ్య గౌడ్ హాజరయి మాట్లాడారు. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని, చేయడానికి పనుల్లేకపోవడంతో ఆయా మండలాల ప్రజలు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసల నివారణకు చర్యలు చేపట్టి స్థానిక ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మధు, వ్యకాస నాయకులు శిఖామణి, కాశీ పాల్గొన్నారు .



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు